విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

గురువారం 15 ఆగస్టు 2024 8 పేజీలు

చేయి చేయి కలుపుదాం...
వయనాడ్ బాధితులను ఆదుకుందాం

ఇప్టా జాతీయ కార్యదర్శి గని పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రకృతి ప్రళయానికి బలైపోయిన వయనాడ్ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో విరాళాలు సేకరణను గుంటూరు నగరంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా గని, జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ వయనాడ్‌లో కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదల కారణంగా కొండ చర్యలు విరిగిపడి సుమారు 400 మందికిపైగా మృత్యువాత పడటం, ఊర్లకు ఊర్లు కొట్టుకుపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. అక్కడి ప్రజలు కూడు, గూడు కోల్పోయి బిడ్డలకు దూరమై భయంకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితులను ఆదుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని, ఎవరికి వారు ముందుకు వచ్చి తమ వంతుగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి పైసా వయనాడ్ బాధితులకు చేరే విధంగా ప్రజానాట్యమండలి, సీపీఐ తమ వంతు కృషి చేస్తాయని హామీ ఇచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ దేశంలోని అనేక ప్రాంతాలలో గతంలో జరిగిన ప్రకృతి విపత్తుల సమయంలో వయనాడ్ ప్రజలు ముందుకు వచ్చి సాయం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా -మిగతా 2 లో ...

మరో ఉద్దానంలా మారకముందే
కిడ్నీ బాధితులను కాపాడండి

ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రను జయప్రదం చేయండి : దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణానది చెంతనే ఉన్న ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో కృష్ణా జలాలు సరఫరా కాకపోవటంతో ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని మరో ఉద్దానంలా మారక ముందే కిడ్నీ బాధితునలు కాపాడాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. స్థానిక దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి ప్రజలు సిలికాన్, ఫ్లోరైడ్ కలిసిన నీరు త్రాగుతున్నారని తెలిపారు. దాదాపు 100 గ్రామలకు విస్తరించిన ఫ్లోరైడ్ నీళ్ల వల్ల వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఏ.కొండూరు, చీమలపాడు, గంపలగూడెం లాంటి దాదాపు 51 గ్రామాలు, తండాల ప్రజలు గుక్కెడు మంచినీళ్లు దొరక్క బాధపడుతున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడెక్కుతున్న ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 27, 28, 29 తేదీలలో ఏ.కొండూరు నుండి విజయవాడ వరకు జరగనున్న 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర' చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పాదయాత్ర ఎ.కొండూరులోని డయాలసిస్ కేంద్రం వద్ద 27వ తేది ఉదయం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభిస్తారని -మిగతా 2 లో ...

దేశ భక్తిని చాటేలా
'హర్ ఘర్ తిరంగా'

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటి పైన మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల పై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్‌లో -మిగతా 2 లో ...

ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఎందరో మహాను భావుల స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవాన్ని చాటటంతో పాటు జాతీయ జెండా ప్రతిష్టను మరింత ఇనుమడింప చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మాచవరం ఎస్ఎస్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలం నేటి మన స్వేచ్ఛకు మూలధనమన్నారు. అమరుల త్యాగాలతో సిద్ధించిన స్వాతంత్ర్యం ద్వారా ఈనాడు మనందరం స్వేచ్ఛ జీవనాన్ని గడపగలమన్నారు. సుదీర్ఘ పోరాటం వల్ల సాదించుకున్న స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చుకోవటంలో ప్రతి ఒక్కరూ చైతన్యం -మిగతా 2 లో ...

ఎయిమ్స్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మంగళగిరిలోని అఖిల భారత వైద్యా విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో మౌలిక సౌకర్యాల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 13వ షెడ్యూల్ లోని కేంద్రప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ పనుల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష -మిగతా 2 లో ...

గంజాయి విక్రేతల అరెస్టు

- 6 కేజీల గంజాయి స్వాధీనం

8

గుడివాడలో సీఎంకు ఘన స్వాగతం పలకాలి

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడలో అన్న క్యాంటీన్ పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబుకు పతేక ధన్యవాదాలను తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక తుమ్మల రామబ్రహ్మం పార్క్‌లో గురువారం పారంభించనున్న అన్న క్యాంటిన్ పనుల విషయలపై జిల్లా కలెక్టర్ బాలాజీ, -మిగతా 2 లో ...

టీడీఎస్ సమస్యను పరిష్కరించాలి : ఎస్టీయూ

-వివరాలు 6 లో ...

చింతపల్లి సీతారామయ్యకు సీపీఐ నాయకుల పరామర్శ

-వివరాలు 3 లో ...

ఎయిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థుల నిరసన

-వివరాలు 5 లో ...

(మొదటి పేజీ తరువాయి)

వయనాడ్ బాధితులను ఆదుకుందాం...

ఆయన గుర్తుచేశారు. నేడు వయనాడ్ ప్రాంతం సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా వారికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆకిటి అరుణ్‌కుమార్, జంగాల చైతన్య, మంగా శ్రీను, నూతలపాటి చిన్న, బందారు యశ్వంత్, వెంకటేశ్వర్లు, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులను కాపాడండి

చెప్పారు. ఏ.కొండూరు, చీమలపాడు, మైలవరం, చెవుటూరు. జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, గొల్లపూడి జంక్షన్, చిట్టినగర్, నెహ్రూబొమ్మ సెంటర్, మెయిన్ బజార్, వినాయకుడి గుడి, కాళేశ్వరరావు ఫ్లైఓవర్, కంట్రోల్ రూం, బందరు రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ఈ పాదయాత్ర సాగుతుందని వివరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితులతో కూడిన బహిరంగ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కిడ్నీ బాధితుల సభలో ప్రసంగిస్తారు. మూడు రోజులపాటు సాగే పాదయాత్రకు సంఘీభావంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, జి.ఓబులేష్, జి.ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్ తదితర రాష్ట్ర నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని సంఘీభావం ప్రకటిస్తారని తెలిపారు. పాదయాత్ర జరిగే ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతు ప్రకటించాలని కోరారు. జిల్లాలో 18 కిలోమీటర్ల మేర విస్తరించిన వీటీపీఎస్ వాయు కాలుష్యంతో 30వేల్లగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఫ్యాక్టరీలలో, క్వారీలలో వరుస ప్రమాదాలు జరుగుతున్న చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తక్షణమే ఎ.కొండూరు కు కృష్ణాజలాలు సరఫరాకు చర్యలు తీసుకోవాలని, కాలుష్యం నివారణకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర' కరపత్రాన్ని, పాదయాత్ర సాగే వివరాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్నీడు యలమందరావు, బుట్టి రాయప్ప, లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కార్తీక్ పాల్గొన్నారు.

దేశ భక్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా'

అధికారులకు పలు సూచనలు జరీ చేసారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి జాతీయ జెండాలను చేత పట్టి ర్యాలీలు నిర్వహించాలని, వాటి ఫోటోలను తీసి హర్ ఘర్ తిరంగా వెబ్సైటు నందు అప్లోడ్ చేయాలనీ జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. పంచాయతి రాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతిలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలని తెలిపారు. మండల ప్రధాన కేంద్రాల్లో, అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు సెల్ఫీ దిగి ఫోటోను వెబ్సైటు నందు అప్లోడ్ చేయాలనీ మండల అధికారులకు, కళాశాలల యాజమాన్యాలకు తెలిపారు. జిల్లాలో ఎటు చూసిన దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమాలు జరగాలని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో డీఆర్వో, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

కావాలన్నారు. స్వాతంత్య్ర త్యాగమూర్తులను స్మరించుకుంటూ భారత మాతపై వారు చూపిన ప్రేమ, భక్తి భావాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య కీర్తిని నలుదిశల చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ సమగ్రత, సమైక్యతను కాపాడటం వ్యక్తిగత బాధ్యతని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ పూనాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కలెక్టర్ జాతీయ జెండాను చేతబూని విద్యార్థులతో కలిసి హర్‌ఘర్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భవానీశంకర్, డీఆర్వో శ్రీనివాసరావు, తహసీల్దార్ రోహిణిదేవి, శిరీష, సూర్యారావు, ఇంతియాజ్ పాషా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ, డాక్టర్ వెలగపూడి జోషి, రామ్, రమేష్ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ ఎయిమ్స్ కు అప్రోచ్ రహదారుల పెండింగ్ పనులు, నీటి సౌకర్యం, ప్రత్యామ్నాయ విధ్యుత్ లైన్ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు వివరించారు. ఎయిమ్స్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మా మాట్లాడుతూ ఎయిమ్స్ ఆసుపత్రి విస్తరణకు సంబంధించి రీసెర్చ్, క్యాన్సర్ తదితర విభాగాల ఏర్పాటుకు 10 ఎకరాల స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కు వివరించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా, ఆర్అండ్‌బీ ఈఈ సమర్పణ రావు, డీఎంహెచ్ఓ డా.విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): గంజాయి విక్రేతలను యాంటి నార్కోటిక్ పోలీసులు బృందాలు తొమ్మిది మందిని విక్రేతలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విజయవాడ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అడిషినల్ డీసీపీ శ్రీహరిబాబు వివరాలను వెల్లడించారు. ఏపీని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాల మేరకు పటిష్టమైన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా సీపీ ఎస్వీ.రాజశేఖరబాబు పర్యవేక్షణలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో టీటీ టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు గంజాయి రవాణా, కొనుగోలు సరఫరాలకు నిఘా పెట్టారని చెప్పారు. యాంటీ నార్కోటిక్ సెల్ ప్రారంభించినప్పటి నుంచి ఈ ప్రత్యేక బృందాలు గంజాయి విక్రేతలను, సరఫరా చేసే వారి పై ఇప్పటి వరకు 32 కేజులు నమోదు చేసి 94 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి సుమారు 230 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఇందులో భాగంగానే సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ కేసుల్లో చాగలు కృష్ణచైతన్య రెడ్డి(23), చాట్ల రవితేజ(24), వేములవాడ శివ రామకృష్ణ(20), కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు సంబంధించి కోరాడ అజయ్(19), కొక్కుల రుత్విక్(23), కలియపూడి అనిల్ కుమార్(21) పసుపులేటి నరేష్ (22), పటమట పోలీస్ స్టేషన్‌లో కేసుల్లో గద్దం లక్ష్మణరావు(32), బండ కీర్తన్(21)లను అరెస్టు చేశారు. వాని వద్ద నుంచి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రజలందరూ గంజాయి పై నార్కోటిక్ సెల్ పోలీసులకు ఫోన్ 9121162475 నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. ఈ సమావేశంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, సత్యనారాణపురం సీఐ రాజాజీ, శ్రీధర్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో సీఎంకు ఘన స్వాగతం పలకాలి

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మలతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ సిఎం అయిన తర్వాత తొలిసారి వస్తున్న చంద్రబాబు నాయుడుకు గుడివాడ ప్రత్యేకతను చాటి చెప్పేలా ఘన స్వాగతం పలుకుదామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ, నందివాడ, రూరల్ మండలాల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, దానేటి సన్యాసిరావు, వాసే మురళి, వివిధ శాఖల ఉన్నత అధికారులు, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా సీపీ ఎస్వీ.రాజశేఖరబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు ఏపీ సీఎం చంద్రబాబు సహా మంత్రులు, ఇతర ముఖ్య అతిథులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ట్రాఫిక్‌ను ప్రజలు సౌకర్యార్థం వివిధ మార్గాలలో దారి మళ్లించారు. 1. ఉదయం 7గంటల నుంచి కంట్రోల్ రూమ్ వైపు నుంచి బెంజ్‌సర్కిల్ వెళ్లే అన్నీ వాహనాలు. ఆర్టీసీ వై జంక్షన్ నుంచి ఏలూరు రోడ్ మీదుగా స్వర్ణ ప్యాలెస్, దీప్తీ సెంటర్, చుట్టుగుంట, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజ్‌సర్కిల్‌కు చేరుకుంటాయి. 2. బెంజ్‌సర్కిల్ వైపు నుంచి బందర్‌రోడ్‌లోనికి వచ్చే వాహనాలు.బెంజ్‌సర్కిల్ నుంచి ఫకీర్‌గూడెం, స్క్రూబ్రిడ్జి, నేతాజీ బ్రిడ్జి, బస్టాండ్ వైపుకి మళ్లించారు. 3. రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్, శిఖమణి సెంటర్ నుంచి వెటనరీ జంక్షన్ వరకు ఏ వాహ నాలకు అనుమతి లేదు. 4. బెంజ్‌సర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆహ్వానితులకు మాత్రమే అనుమతి.

జాతీయ సమైక్యతకు ప్రతి రూపం హర్ ఘర్ తిరంగ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా స్థానిక గుడ్లవల్లేరు సెంటర్ నందు గుడ్లవల్లేరు మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యా సంస్థలలోని విద్యార్థులు, మండల పరిధిలోని గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక వ్యాపారులు జాతీయ జెండాను చేత బట్టి పెద్దయెత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు మండల ప్రజా పరిషత్ అధికారిణి డి. కృష్ణవేణి మాట్లాడుతూ జాతీయ సమగ్రతను, సమైక్యతను కాపాడటంలో దేశ పౌరులుగా మనందరి బాధ్యత అన్నారు. అనంతరం గుడ్లవల్లేరు తహసీల్దార్ టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ జాతీయ పతాక ఔనత్యాన్ని, ప్రాధాన్యాన్ని చాటి చెప్పేందుకు, ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవటం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణాధికారి దిలీప్ కుమార్, గుడ్లవల్లేరు మండల పరిషత్ పరిపాలన అధికారి మొహమ్మద్ ఇమ్రాన్, మండల విద్యాశాఖాధికారులు జగన్మోహనరావు, గోపాలరావు, మండల పరిషత్ సిబ్బంది, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' టాప్-20 సెమీ ఫైనలిస్ట్‌లో వైజాగ్ హమారా ల్యాబ్స్ బృందం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' టాప్-20 సెమీ ఫైనలిస్ట్‌లో వైజాగ్ కు చెందిన హమారా ల్యాబ్స్ బృందం షార్ట్‌లిస్ట్ లో నిలిచింది. సామ్‌సంగ్ ఇండియా తన ఫ్లాగ్‌షిప్ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రోగ్రామ్ 'సాల్వ్ ఫర్ టుమారో' 2024 కోసం టాప్ 20 టీమ్‌ల జాతీయ షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన వ్యక్తులు సెమీ ఫైనలిస్ట్ లలో ఉన్నారు. ఈ కార్యక్రమం 3వ ఎడిషన్‌లో, విద్యార్థులు తమ ఆలోచనలను కమ్యూనిటీ, ఇన్‌క్లూజన్, పర్యావరణం, సుస్థిరత అనే రెండు అంశాల క్రింద సమర్పించారు. దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను పెంచే స్థానిక ప్రతిభావంతుల ప్రయాణాన్ని చూసేందుకు తాము సంతోషిస్తున్నామని ఐఐటీ (ఢిల్లీ) ఎఫ్ఐటీటీ ఎండీ ప్రొఫెసర్ ప్రీతి రంజన్ పాండా పేర్కొన్నారు.

నగరంలో పీబీ పార్ట్‌నర్స్ న్యూ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ క్రింద ఉన్న బ్రాండ్, పీబీ పార్ట్‌నర్స్, దాని పీఓఎస్‌పీ మోడల్ ద్వారా ముఖ్యంగా పట్టణాలు, చిన్న నగరాల్లో బీమా సౌలభ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉంది. విస్తృతమైన ఏజెంట్ భాగస్వామి శిక్షణ, అత్యాధునిక సాంకేతికతపై దృష్టి సారించి, పీబీ పార్ట్‌నర్స్ మంచి భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తోంది. ఈ లక్ష్యానికి అనుగుణంగా, పీబీ పార్ట్‌నర్స్ ఇటీవల నగరంలో కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏజెంట్ భాగస్వామి ఎంగేజ్‌మెంట్, అప్-స్కిల్‌మెంట్ పట్ల పీబీ పార్ట్‌నర్స్ కొనసాగిస్తున్న నిబద్ధతను కలిగి ఉంటాయి. ఏజెంట్ భాగస్వాములు, వ్యాపార నాయకుల మధ్య సహకారాన్ని పెంపొందించడంలో ఇవి కీలకమైనవి.

మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ఎంజి విండ్సర్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: జేఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా తమ రాబోయే వాహనం భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ - ఎం జి విండ్సర్ యొక్క కొత్త టీజర్ ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలు తెలిపారు. ఈ టీజర్ విభాగంలో తొలిసారి సమర్పించిన ఏరో-లాంజ్ సీట్ల యొక్క ఇటీవలి వెల్లడింపు తరువాత విడుదలైన్నారు.ఇది ఇప్పటికే విభాగంలో సౌకర్యం మరియు విలాసాల కోసం కొత్త ప్రామాణాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఆధునిక ఫీచర్స్ కలయిక ఈ టీజర్ విభాగంలో తొలిసారి సమర్పించిన ఏరో-లాంజ్ సీట్ల యొక్క ఇటీవలి వెల్లడింపు తరువాత విడుదలైందన్నారు. ఈ ఆధునిక ఫీచర్స్ కలయిక ఎం జి విండ్సర్ ను భారతదేశపు వినియోగదారుల కోసం ఎం జి విండ్సర్ ను ఒక ప్రత్యేకమైన ఎంపికగా చేసిందన్నారు ప్రతి వివరానికి చూపించబడిన శ్రద్ధ ప్రపంచంలోనే ఈ అతి ఎక్కువగా ఆక్రమించబడిన కోటకు మరొక హాల్ మార్క్ గా నిలిచిందన్నారు. ఎం జి విండ్సర్ ఈ శ్రేష్టతను ప్రతిబింబిస్తోందన్నారు. విండ్సర్ కోటలో ఉంచిన అదే స్థాయి ఆధిక్యత మరియు విలాసాన్ని చూపించేలా కారులో ప్రతి అంశం ఖచ్చితంగా రూపొందించబడిందని నిర్ధారిస్తుందన్నారు.

16 నుండి ఆంధ్రప్రదేశ్ ర్యాంకింగ్ టీటి టోర్నీ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, దామున్ టేబుల్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ నెల 16 నుండి 18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి వై.దామోదర్ రెడ్డి తెలిపారు. వడ్డేశ్వరంలోని కె.ఎల్.డీమ్డ్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు ఈ టోర్నీ జరుగుతుందని, టోర్నీకి యూనివర్సిటీ యాజమాన్యం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. అండర్-11, 13, 15, 17, 19 బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో టోర్నీ జరుగుతుందని ఆయన తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి సుమారు 550 ఎంట్రీలు వచ్చినట్టు తెలిపారు. 16వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్య అతిథులుగా కె.ఎల్.డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.జి.పి.సారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డా.ఏ.వి.ఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డా.కె.సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.ఎస్.ప్రకాష్ రావు, పి.విశ్వనాధ రావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.బలరామ ప్రసాద్ లు పాల్గొంటారని దామోదర్ రెడ్డి తెలిపారు.

బాదం మంచితనంతో తోబుట్టువుల బంధాన్ని వేడుక చేసుకోండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పండుగ సీజన్ ప్రారంభాన్ని రక్షా బంధన్ సూచిస్తుంది. తమ సోదరుల ఆరోగ్యం, దీర్ఘాయువు కోసం తోబుట్టువులు ప్రార్థిస్తే.. తమ సోదరీమణులను ఆదుకుంటామని, వారికి రక్షణ కల్పిస్తామని సోద రులు ప్రతిజ్ఞ చేస్తారు. ఈ హృదయపూర్వక నిబద్ధతను గౌరవించడానికి, రోజువారీ ఆహారంలో బాదం వంటి పోషకమైన ఆహారాలను చేర్చడం ద్వారా ఈ రక్షా బంధన్‌ను మరింత అర్థవంతం చేసుకోవచ్చు. రక్షా బంధన్‌ను ఎలా జరుపుకుంటా నని బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ వెల్లడిస్తూ, "రక్షాబంధన్ నాకు, నా కుటుంబానికి ప్రత్యేకమైన రోజు. నేను ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన డెజర్ట్, గ్రిల్డ్ బాదం బర్ఫీని తయారు చేస్తాను. ఇది రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైనది కూడా" అని అన్నారు. బాదం పప్పులు రుచికరమైనవి మాత్రమే కాకుండా అధిక పోషకమైనవి కూడా అని, బాదంపప్పులో విటమిన్ ఇ, ఆరోగ్యకర మైన కొవ్వులు పుష్కలంగా ఉన్నాయని పలువురు నిపుణులు తెలియజేస్తున్నారు.

చింతపల్లి సీతారామయ్యకు సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-గన్నవరం : వీకెఆర్ కాలేజీ మాజీ కరస్పాండెండ్ చింతపల్లి సీతారామయ్యను సీపీఐ నాయకులు పరామర్శించారు. సీతారామయ్య కుమారుడు అనారోగ్యంతో అమెరికా ఫ్లోడా రాష్ట్రంలో ఓర్లాండ్ పట్టణంలో ఇటీవల మృతిచెందాడు. బుధ్దవరం చింతపల్లి సీతారామయ్య నివాసంలో ఆయన పరామర్శించి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ రామచంద్రజోషి విశ్రాంత ఇంజినీరింగ్ కంభంపాటి పాపారావు, కట్టవరపు విజయరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

పెడనలో హర్ ఘర్ తిరంగా

విశాలాంధ్ర-పెడన: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పెడన పురపాలక సంఘం ఆధ్వర్యంలో విజయానంద డిగ్రీ కళాశాల విద్యార్థులచే జాతీయ జెండాలతో గూడూరు రోడ్డు రైల్వే గేట్ సమీపంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయానంద డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పురపాలక సంఘ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

త్రివర్ణ పతాకంతో ప్రదర్శనలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ విద్యాసంస్థల ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకంతో ప్రదర్శనలు జరిగాయి. స్థానిక మండలపరిషత్తు కార్యాలయం నుంచి వికాస్, శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థుల చేపట్టిన ప్రదర్శనను ఎమ్మెల్యే కొలికపూడి ప్రారంభించగా, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. జడ్పీ పాఠశాల విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలో ఎంపీపీ పి.మేర్సీ వనజాక్షి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఐగా వైవీఎల్ నాయుడు బాధ్యతలు

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ సిఐగా బుధవారం వైవిఎల్ నాయుడు బాధ్యతలు స్వీకరించారు. సిఐ వైవిఎల్ నాయుడు మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పై ప్రత్యేక దృష్టి పెడతానని ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి నన్ను కలవచ్చని ఫిర్యాదు అందిన వెంటనే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని సిఐ అన్నారు.

విజయవాడ-దేవరకోట 333జి బస్సు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : విజయవాడ నుంచి ఉయ్యూరు, పామర్రు, కూచిపూడి, మొవ్వ, కొడాలి, ఘంటసాల మీదుగా దేవర కోటకు వెళ్లే333-జి మెట్రో సర్వీస్ బస్సును పునరుద్దరించాలని మొవ్వమండలానికి ఆ సర్వీసులోవచ్చే ఉపాధ్యాయులు, అధ్యాప కులు ఉద్యోగులు కోరుతున్నారు. విజయవాడ గవర్నర్ పేట-2 డిపో 333-జి మెట్రో సర్వీస్ బస్సు ప్రతిరోజుఉదయం 6:40 గంటలకు విజయవాడ నుంచి వచ్చేది. అయితే ఇటీవల దాని స్థానంలో నైటుహేల్టుగాపల్లె వెలుగు బస్సును ఏర్పాటు చేసి నడపడంతో తామంతా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు.

'హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : జిల్లా పర్యాటక, యువజన సంక్షేమ క్రీడలు, విద్యాశాఖలతో పాటు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మచిలీపట్నం ఛాంబర్ ఆఫ్ .కామర్స్ సహకారంతో బుధవారం స్థానిక కోనేరు సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ ర్యాలీలో మచిలీపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నగరంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 365 అడుగుల జాతీయజెండాను చేతపట్టి స్వాతంత్ర్య ఉద్యమ ఘటనను గుర్తు చేస్తూ దేశ సమగ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వందేమాతరం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీదేవి, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీ లక్ష్మీ, నెహ్రూ యువ కేంద్రం అధికారి సుంకర రాము, జిల్లా యువజన సంక్షేమ అధికారి డి. సుబ్బారావు, ఉప విద్యాశాఖ అధికారి శేఖర్ సింగ్, ఎంఈఓ దుర్గాప్రసాద్, తహసీల్దార్ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు కళాకారుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సాంస్కృతిక కార్యక్రమాలు ఎచట జరిగినా కుర్చీలు సర్దటంనుంచి మంచినీరు అందించడం నుంచి ఆ కార్యక్రమం పూర్తయ్యే వరకు శ్రోతలకు ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విజయవంతం కావటానికి శ్రమ పడుతున్న చెల్లూరి శివయ్య(శివ) కు పలు కళా సంస్థల ప్రతినిధులు, కళాకారులు ఆర్థిక సహాయాన్ని అందించారు. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో గాయనీ గాయకులు స్వాతి, రేష్మా, షబన, రేష్మ, కామేశ్వరి, రత్నకుమారి, మల్లీశ్వరి, డేవిడ్ రాజు, ప్రిన్స్, జోషి, జోసఫ్, ఆశయ్య పలు చిత్రాలలోని పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు. గాయనీ గాయకులు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఘంటసాల ఎంపీడీఓగా అనూహ్య బాధ్యతలు

విశాలాంధ్ర-ఘంటసాల : మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా టి. అనూహ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ అనూహ్యకు మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాస చంద్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరావు, పి.స్వామి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సి ఓ సుబ్రహ్మణ్యం సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఘంటసాల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న అనూహ్య ఎన్నికల కోడ్ బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు ఎంపీడీఓగా వెళ్లారు. ఎన్నికల కోడ్ ముగియడంతో జరిగిన బదిలీల్లో భాగంగా ఘంటసాల ఎంపీడీఓగా అనూహ్య బాధ్యతలు చేపట్టారు.

రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ గంగాధరరావు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : మచిలీపట్నం లోని ఏఆర్ పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పెరేడ్ రిహార్సల్స్ ను బుధవారం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు వీక్షించారు. పెరేడ్ కమాండర్గా ఆర్ఐ సతీష్ కుమార్ వ్యవహరించారు. ఎస్పీ గంగాధరరావు పోలీస్ అధికారులతో కలిసి పరిశీలన వాహనం పై నుండి రిహార్సల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గురువారం జరిగే వేడుకలకు ఎలాంటి అవాంతరాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందజేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేసిన పొలాలలో రైతులకు,కౌలు రైతులకు ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అందజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే మొవ్వ మండలంలోని 21 గ్రామాల్లో దాదాపు వరి నాట్లు పూర్తికావచ్చినాయని, కానీ వరి నాట్లు వేసిన పొలాల రైతులకు , కౌలు రైతులకు ఎరువుల అవసరం ఎంతగానో ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా రైతులకు తక్షణం ఎరువులు అందించాలని రైతు సంఘం ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. రాష్ట్రస్థాయిలో సంఘం తరపున ఇప్పటికే సంబంధిత మంత్రులకు, అధికారులకు విన్నవించినట్లు ఎరువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి కొనడం వల్ల అధిక రవాణా ఖర్చు జరుగుతోందని. ఈ పరిస్థితులలోసొసైటీల ద్వారా ఎరువులు, పురుగుమందులు సత్వరమే అందించి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు.

భార్యపై గొడ్డలితో దాడి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కట్టుకున్న భార్యపై గొడ్డలితో దాడి చేసి, గాయపరిచిన సంఘటన విస్సన్నపేటలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... స్థానిక ఎస్టీ కాలనీలో నివసిస్తున్న తేనేటి సురేష్, కాంతామణి దంపతులకు కొంతకాలంగా మనస్పర్ధలు చోటు చేసుకుని, తరచూ గొడవ పడుతున్నారు. పెద్దలు నచ్చచెప్పటంతో కలసి ఉంటున్నప్పటికీ, ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సురేష్ ఇంట్లో ఉన్న గొడ్డలితో కాంతా మణి తల, మెడపై గాయపరిచాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని విస్సన్నపేట ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా, విస్సన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రతి ఎకరానికి ఈ-పంట నమోదు అవసరం

విశాలాంధ్ర-పమిడిముక్కల : ప్రతి రైతు తనకున్న ప్రతి ఎకరానికి ఈ-పంట నమోదును రెవిన్యూ అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.గణేష్ రెడ్డి తెలిపారు.బుధవారం మండల వ్యవసాయ కార్యాలయం లో ఈ-పంట నమోదు పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన,పంట కోత ప్రయోగాలు పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి నాగ దేవిశ్రీ,రిసర్వే డి.టి.ఏసుపాదం, ఎవోఓ దీపికా గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు పలువురు రైతులు పాల్గొన్నారు.

కలర్డ్ జెమ్ స్టోన్ రింగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డును గెలుచుకున్న కీర్తిలాల్స్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ వజ్రాలు బంగారు ఆభరణాల బ్రాండ్ కీర్తిలాల్స్‌కి ఇటీవల ముంబైలో జరిగిన రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2024 యొక్క 19వ ఎడిషన్ లో ప్రతిష్టాత్మకమైన 'కలర్డ్ జెమ్ స్టోన్ రింగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ శాంత కుమార్ మాట్లాడుతూ నగల ఉత్పత్తిలో వినూత్న డిజైన్ అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించడంలో కీర్తిలాల్స్ నిబద్ధత ఈ అవార్డు ద్వారా గుర్తించబడిందన్నారు. అవార్డు గెలుచుకున్న జెమ్ స్టోన్ ఉంగరం వినూత్న రూపకల్పనకు సమకాలీన వినియోగదారుల యొక్క మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్ ఆవిష్కరణలో కీర్తిలాల్స్ అంకితభావానికి సరైన ఉదాహరణ, ప్రతి భాగాన్ని విలువైనదిగా నిర్ధారించడానికి, బ్రాండ్ యొక్క పరిశోధన మరియు అభివృద్ధి బృందం ఈ మారుతున్న ప్రాధాన్యతలను అర్థం చేసుకోవడానికి మరియు వాటిని అందించడానికి అవిశ్రాంతంగా పని చేస్తుందన్నారు. 1939 నుండి ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతున్న వారసత్వంతో, డైరెక్ట్ డైమండ్ సోర్సింగ్, అత్యాధునిక ఫ్యాక్టరీలు, అత్యాధునిక డిజైన్ స్టూడియో అగ్రశ్రేణి ఉత్పత్తి పద్ధతులతో కూడిన పూర్తి కార్యాచరణతో, కీర్తిలాల్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వజ్రాల సమ్మేళనంగా పేరు తెచ్చుకుందని చెప్పారు.

శ్రీయుత ఏడవ అదనపు జిల్లా జడ్జి, ఒంగోలు వారి కోర్టులో

M.V. O.P.No. 192/2019

వాయిల బుజ్జమ్మ మరియు ఇతరులు - పిటిషనర్స్

Vs

జి. రాంబాబు మరియు ఇతరులు - రెస్పాండెంట్స్

నోటీసు

To

R1: జి. రాంబాబు, S/o. లక్ష్మణ స్వామి, డోర్ నెం. 61-11-5, వార్డ్ నెం. 14, కృష్ణలంక, విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా.

R3: జి. రాంబాబు, S/o. లక్ష్మణ స్వామి, డోర్ నెం. 61-B/1-11-5, సత్యనారాయణ నగర్, కృష్ణలంక, విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా.

పై నంబరు గల I.A. No. 245/2023 in M.V. O.P. No. 192/2019లో నోటీసు నిమిత్తం అనేక పర్యాయములు కోర్టుద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసు తెలియపర్చడమైనది. కావున మీరు తేదీ 30-8-2024న ఉదయం 10 గం.30 ని.లకు పైకోర్టులో స్వయంగా గాని, లాయరు ద్వారా గాని హాజరైమీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేదీ 30-8-2024

జి బాలాజీ రావు, అడ్వకేట్, ఒంగోలు.

సెల్ : 9618344053

శ్రీయుత ఏడవ అదనపు జిల్లా జడ్జి, ఒంగోలు వారి కోర్టులో

M.V. O.P.No. 205/2019

ప్రళయకావేరి పాపమ్మ మరియు ఇతరులు - పిటిషనర్స్

Vs

జి. రాంబాబు మరియు ఇతరులు - రెస్పాండెంట్స్

నోటీసు

To

R1: జి. రాంబాబు, S/o. లక్ష్మణ స్వామి, డోర్ నెం. 61-11-5, వార్డ్ నెం. 14, కృష్ణలంక, విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా.

R3: షేక్ సతీష్, S/o. మొహిద్దీన్, డోర్ నెం. 75-14-106, భవానీపురం, కృష్ణలంక, విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా.

పై నంబరు గల M.V.O.P.No. 205/2019లో నోటీసు నిమిత్తం అనేక పర్యాయములు కోర్టుద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసు తెలియపర్చడమైనది. కావున మీరు తేదీ 30-8-2024న ఉదయం గం.10-30 ని.లకు పైకోర్టులో స్వయంగా గాని, లాయరు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేదీ 30-8-2024

జి బాలాజీ రావు, అడ్వకేట్, ఒంగోలు.

సెల్ : 9618344053

గుడివాడలో 200 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

విశాలాంధ్ర-గుడివాడ : బిజెపి అధ్వర్యంలో బుధవారం పాఠశాల, కళాశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 200 అడుగుల జాతీయ జెండాతో బిజెపి నాయకులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆజాదీకి అమృత్ వేడుకలలో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులతో కలసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించడం కోసం ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అందులో భాగంగానే నేడు 200 అడుగుల భారతదేశ జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, బిజెపి జిల్లా కర్యదర్శి అంగడాల సతీష్, నియోజవర్గ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు,

జిల్లా నాయకులు సూరే గాంధీ, పట్టణాధ్యక్షుడు యర్రబోతు అర్జున్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : పోస్ట్ ఆఫీసు ద్వారా జాతీయ జెండా విక్రయాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. తిరంగా రన్ హర్ ఘర్ ప్రతి గ్రామంలో నిర్వహించాలని మండలి పిలుపునిచ్చారు. అవనిగడ్డలో మండలి స్వగృహంలో అవనిగడ్డ పోస్ట్ ఆఫీసు ఆధ్వర్యంలో ప్రతి ఇంట త్రివర్ణ పతాకం ఎగురవేసే కార్యక్రమం పురస్కరించుకుని జాతీయ పతకాల విక్రయాల కార్యక్రమాన్ని మండలి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ టి గిరీష్, పోస్ట్‌మ్యాన్ ఎన్ నరేష్, ఎబిపిఎంకె నాగరాజు పాల్గొన్నారు.

నిడుమోలులో శానిటేషన్

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో వైరల్ జ్వరాలు కొనసాగుతుండటంతో గ్రామపంచాయతీ, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది శానిటేషన్ పై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే బుధవారం మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారిపై గల నిడుమోలు గ్రామంలో కార్యదర్శి ఎ.ఎన్.ఎస్ మూర్తి పర్యవేక్షణలో సిబ్బంది సున్నం, బ్లీచింగ్ ప్రధాన రహదారుల పక్కనే కాకుండా గ్రామంలోని అంతర్గత రహదారుల మార్జిన్లలో కూడా చల్లించారు. ఈ కార్యక్రమాలను సర్పంచ్ కొమరగిరి అంజలి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

వయనాడ్ బాధితులకు సెయింట్ జాన్స్ రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రార్థించే పెదవులకన్నా - సాయంచేసే చేతులు మిన్న అని విద్యార్థులు నిరూపించారని సెయింట్ జాన్స్ ఇంగ్లీషుమీడియం హైస్కూల్ డైరెక్టర్ సాబు జాన్ అన్నారు. కొద్దిరోజుల క్రితం కేరళ రాష్ట్రంలోని వైనాడ్ ప్రాంతం వరదల భీభత్సానికి అతలాకుతలమై దీనస్థితిలో ఉన్న అభాగ్యులకు తమకు తోచిన సహాయసహకారాన్ని అందించాలనే ధృడసంకల్పంతో సిద్ధమైన సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు రూ.50 వేలు సేకరించి బుధవారం పాఠశాల డైరెక్టర్ సాబు జాన్‌కు అందజేశారు. రూ.50 వేల చెక్కును కేరళ ముఖ్యమంత్రి

సమయనిధికి జమచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఝన్సీసాబు, సిబ్బంది ఉన్నారు.

ప్రామాణికంగా ఈ-పంట నమోదు : ఏఓ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల పరిధిలోని కౌతావరం గ్రామంలో జరుగుతున్న ఈ -పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి లోయ.సునీల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఖరీఫ్-2024 పంట కాలంలో సాగు పంట యొక్క పూర్తి వివరాలు, పంట రకంతో సహ రైతులు వివరంగా రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఈ-పంటలో నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ-పంటలో సాగు వివరాలు నమోదు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏ లు, గ్రామ రైతులు పాల్గొన్నారు..

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఆంధ్రప్రదేశ్ 104 ప్రోగ్రామ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బుధవారం చోరంపూడిలోని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచితంగా ప్రజలకు ఇస్తున్న మందులు గురించి అడిగి తెలుసుకొని, రికార్డ్స్ తనిఖీ చేశారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అన్నికాలాల మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కె .సువర్చల మరియు వి.జయశ్రీ,చిన్ని కృష్ణ , టిబి కంట్రోల్ అధికారి చిన్ని కృష్ణ,మచిలీపట్నం,ల్యాబ్ సూపర్ వైజర్ రమేష్ మచిలీపట్నం, ఎం పి హెచ్ ఇ ఓ ఏడుకొండల రావు, హెల్త్ సూపర్ వైజర్ ఎం ఏసుదాసు,ఎం ఎల్ పి హెచ్ అఖిల, శివ కుమార్ టిబి సూపర్ వైజర్, హెల్త్ అసిస్టెంట్ రాజారావు, ఎ ఎన్ ఎం ఇందిర, 104 ఫార్మసిస్ట్ విజయ్ శ్రీహరి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పొట్లూరి, నిమ్మగడ్డ

విశాలాంధ్ర-గుడివాడ : ది గుడివాడ క్లబ్ నూతన కర్యవర్గం ఏకగ్రీవం ఎన్నుకున్నట్లు క్లబ్ ఎలక్షన్ అధికారి పొట్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక ది గుడివాడ క్లబ్‌లో జరిగిన క్లబ్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పొట్లూరి వెంకటేశ్వరరావు, సెక్రటరీగా నిమ్మగడ్డ శివశంకర్, జాయింట్ సెక్రటరీగా విశ్వంశెట్టి కృష్ణకిషోర్, కోశాధికారిగా డా॥ మాగంటి శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పొట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తోట వెంకటరాధకృష్ణ, పొట్లూరి వెంకటకృష్ణారావు, పిన్నమనేని సాంబశివరావు, నర్రా శ్రీనివాసరావు, కఠారి వెంకటరమణత, ముప్పా శ్రీరామ పూజేశ్వరరావు, నెరుసు జయరామ్‌లను కూడ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లికి వందనం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తల్లికి వందనం కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక సందేటివారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లిదండ్రులతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాల వినియోగంతో చిన్నారులకు లభించే పౌష్టికతలను వివరించారు. తల్లి ప్రాధాన్యతను చిన్నారులకు వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్‌కె.బాజి, ఎ.చైతన్యభవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, పద్మ, దుర్గాభవాని, మహాలక్ష్మి, జమలమ్మ, గోవర్ధన, జ్యోతి పాల్గొన్నారు.

మొవ్వ ఎండీఓగా సుధా ప్రవీణ్ బాధ్యతలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి సుధాప్రవీణ్ బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగాజరిగిన బదిలీలలో భాగంగా ఫిబ్రవరి నెలలో ఈయన మొవ్వ మండలం నుంచి ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం ఎండిఓగా బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం నిర్వహించిన బదిలీలలో సుధా ప్రవీణ్ ను జిల్లాఅధికారులు మొవ్వ మండలానికి బదిలీ చేశారు. ఎండిఓ గా బాధ్యతలు చేపట్టిన ఈయనను ఈ.వో.పీ.ఆర్.డి. వీర్ల సీతారామరాజు, ఏవో నూతలపాటి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ చిందా శ్రీనివాసరాజు, జూనియర్ అసిస్టెంట్లు చింతా రామ్మూర్తి, ఎస్ వి ప్రవీణ్ కుమార్, గారూ మండలంలోని మేజర్, మైనర్ గ్రామపంచాయితీల కార్యదర్శులు కలసి అభినందించారు.

ఎమ్మెల్యే వెనిగండ్లను కలిసిన ఎమ్మెల్యేలు గద్దె, కామినేని

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదికలోని బుధవారం టిడిపి కార్యాలయంలో రాష్ట్ర రాజకీయ ప్రముఖులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో స్నేహపూర్వక భేటీ అయ్యారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, మాజీ రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, జడ్పీ మాజీ చైర్మన్ గద్దె అనురాధలు ఎమ్మెల్యే రాము ప్రజా వేదికలో కలిసిన సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ డిగ్రీతో ఉద్యోగాలు పుష్కలం : వీసీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. విజయ కుమారి అధ్యక్షతన జరిగింది. కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆర్. శ్రీనివాసరావు ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ కె. శోభన్ బాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన కృష్ణా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ వైకె. సుందర కృష్ణ, అధ్యాపకులు, భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భాషా సాంస్కృతికశాఖ సంచాలకులుగా ఐఎఎస్‌ను నియమించాలి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులుగా ఐఏఎస్ అధికారిని నియమించాలని పలువురు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉన్నవారే తిరిగి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోందని, ఆ శాఖ ఎదుర్కొంటున్నటువంటి అనేక రకాల విమర్శలకతీతంగా పారదర్శకమైన, సమర్ధవంతమైన పాలన సాగించేందుకు భజన పరులను దూరంగా ఉంచే పూర్తి ఐఏఎస్ అధికారి అయితేనే బాగుంటుందని పలువురు వ్యాఖ్యానించుకుంటున్నట్లు సమాచారం.

ఎంపీడీవో శ్రీనివాసరావు బాధ్యతలు

విశాలాంధ్ర-నందిగామ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నందిగామ మండల ఎంపీడీవో గా బదిలీపై వెళ్లిన పి శ్రీనివాసరావు, మరళా నందిగామ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు, ఇప్పటివరకు ఎంపీడీవో గా పనిచేసిన విశ్వనాధ్ బదిలీపై వెళ్లారు.ఎంపీడీవో శ్రీనివాస రావు ను మండల పరిషత్ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హర్ ఘర్ తిరంగ్, వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ ఆర్ట్స్ వారి సార్ధ్యంలో పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు బుదవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో విజేతల్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహనరావు ప్రకటించారు. పాఠశాల స్థాయిలో జి దేవి, పి.గీతాశ్రీ, ఎం ప్రజ్ఞ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందారు. జూనియర్ కళాశాల స్థాయిలో పి.హాసిని,షేక్ బోనిషన్,బి.లక్ష్మి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. డిగ్రీ స్థాయిలో సుధీర్,సుధారాణి, సునీత మూడు స్థానాల్లో నిలిచారు. ఇంటి మీద భారత పతాకం రెపరెపలాడుతూ ఎగురవేయాలనీ పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బి.ఆనంద కుమార్ సార్ధ్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది.

ప్రజా సమూహాల భాగస్వామ్యంతోనే సమ్మిళిత భారత్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారతదేశంలో కుల, మత, వర్గ ప్రాంతాలకతీతంగా ప్రజా సమూహాలన్నింటినీ భాగస్వామ్యులను చేసి నిర్మాణాత్మకంగా కృషి చేస్తేనే సమ్మిళిత భారత్ వికసిస్తుందని మాజీమంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో 'స్వతంత్ర భారత్ ప్రగతి-అవరోధాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో మహత్మా గాంధీజీ నిర్దిష్ట కార్యా చరణతో సామాజిక సమూహాలన్నింటిని ఐక్యపరిచి భారత జాతి నిర్మాణానికి కృషి చేస్తూ స్వాతంత్రాన్ని సాధించగలిగారన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆధునిక కాలంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు పయనిస్తుంటే మన పాలకులు మధ్య యుగాల ఆలోచనలతో సమాజాన్ని తిరోగమన దిశగా పయనింప చేస్తున్నారని విమర్శించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం భారత్ అనేక రంగాలలో అభివృద్ధి చెందినా ప్రపంచంలో ప్రతి ముగ్గురి నిరక్షరాస్యులలో పేదలలో నిరుద్యోగు లలో ఒకరు భారతీయుడుగా ఉండటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టర్ మాట్లాడుతూ విద్యపై స్థూల జాతీయ ఉత్పత్తిలో 6 శాతం ఉండాలని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నా మన పాలకులు 3 శాతం లోపే కేటాయి ంచడం వలన విద్యారంగం అట్టడుగున ఉందన్నా రు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, పి.శేషుబాబు, కొరివి వినయ కుమార్, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, శివాజీ, సాంబశివరావు, పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టండి

విశాలాంధ్ర - కారంపూడి: మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం, మురుగు కాలువల పూడికతీత పై దృష్టిపెట్టాలని గురజాల డివిజనల్అభివృద్ధి అధికారి డి గబ్రునాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం నందు అన్ని పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీజ నల్ వ్యాధులు విజృంభించకుండా గ్రామాలలో మంచినీటి ట్యాంకుల క్లోరి నేషన్, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఒప్పిచర్ల గ్రామంలో అతిసారం కేసులు ఉన్నందు వలన మంచినీటి పరీక్ష చేయగా ఎస్సీకాలనీలో ఉన్న బోరు నీటిలో అధికంగా నైట్రేట్లు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆ బోరు నీటిని ఎవ్వరు త్రాగకుండా ఉండేందుకు బోరును మూసివేశామని తెలిపారు. ఒప్పిచర్ల గ్రామంలో పిచ్చిమొక్కలను జెసిబితో తొలగించి పరిసరా లను పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడివో జి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంచాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రతి స్కూల్లో విద్యార్థులకు దేశభక్తి పెంపొందించేలా దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల జీవితాలను విద్యార్థులకు బోధించాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురువారం అంజుమన్-ఎ-ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో అంజుమన్ హైస్కూల్ నుంచి అంజుమన్ షాదీ ఖానా వరకు ఆవో సాత్ చలేంగే దేశ్ కేలియే ఆజాది అంజుమన్ కే సాత్ ర్యాలీలో 1000 మంది విద్యార్థులు, ముస్లిం నేతలు, మత పెద్దలతో కలిసి భారీ జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మన కోసం మన దేశం కోసం అహర్నిశలు శ్రమించి స్వాతంత్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులు సేవలను స్పందించుకుంటూ వారి బాటలో పైనిద్దామని వారిలాగే భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, డిప్యూటీ మేయర్ సజీలా, మాజీ కార్పొరేటర్ బాషి, అంజుమన్ కమిటీ సభ్యులు షాహిదా, జైదా, అన్వర్ హుస్సేన్, పటాన్ మొహమూద్, మటన్ రఫీ, డాక్టర్ అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కే ఆధారం : కలెక్టర్

విశాలాంధ్ర-మేడికొండూరు: మానవాళి మనుగడకు మొక్కే ఆధారమని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. మేడికొండూరు మండలం విశదల గ్రామ రహదారి ప్రక్క ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి మొక్కలు నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యక్రమం ద్వారా రోడ్డుకి ఇరువైపులా ఒక కిలోమీటర్ పరిధిలో 400 మొక్కలు 3,77,000 రూపాయల ఖర్చుతో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు మానవాళి మనుగడకు అవసరమైన ఆక్సిజన్ అందించడంలో చెట్లు ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ పర్యవేక్షిస్తూ వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలతో కలెక్టర్ మాట్లాడారు. డ్వామా పిడి ఉమాదేవి, ఎంపీడీవో ప్రభాకర్ రావు, తహసిల్దార్ బి పద్మనాభుడు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎం కె కిరణ్మయి, మేడికొండూరు సిఐ డి జయ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న ఆటో డ్రైవర్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలో ఓ ఆటోడ్రైవర్ మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం గుం టూరు నుంచి మంగళగిరికి ఓ మహిళఆటోలో వచ్చింది. ల్యాప్‌టాప్, పలు వెండి వస్తువులు ఉన్న బ్యాగ్ ను ఆటోలో మర్చిపోయింది. ఆ బ్యాగ్‌ను సురేష్ అనే ఆటో డ్రైవర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. కొద్దిసేపటి తర్వాత సదరు మహిళ సైతం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని తన బ్యాగ్ పోయిందని పట్టణ సీఐ వినోద్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఆటోడ్రైవర్ సురేష్‌ను పిలిపి ంచిన సీఐ వినోద్ కుమార్ ఆటో డ్రైవర్ చేతుల మీదుగా ల్యాప్ ట్యాప్, వెండి వస్తువులను అందజేయించారు. మానవత్వాన్ని చాటుకున్న ఆటో డ్రైవర్ సురేష్‌కు, సీఐ వినోద్ కుమార్‌కు మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

మహిళను రక్షించిన పోలీసులు

విశాలాంధ్ర-మంగళగిరి : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను మంగళవారం రాత్రి ఆకతాయిలు వెంబడించి అసభ్యకరంగా ప్రవర్తించారు. మహిళ భర్త అతిగా మద్యం సేవించి వాహనాన్ని నడపలేని స్థితిలో ఉండడంతో ఈ విషయాన్ని గమనించిన ముగ్గురు యువకులు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించారు. హైవేలో విధుల్లో ఉన్న సేల్స్ టాక్స్ అధికారులు ఈ విషయాన్ని గమనించి మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్, పోలీసు వాహనంలో వారి ఇంటి వద్ద దించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వెంకట్ తెలిపారు.

అంబేడ్కర్ భవనం పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏసీ కళాశాల ఎదురు అసంపూర్తి నిర్మాణంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళాలని భీమ్ భారత్, దళిత బహుజన ప్రజా సంఘాల ప్రతినిధులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందజేశారు. అలాగే బృందావన గార్డెన్‌లోని అంధ విద్యార్థుల హాస్టల్ భవనాన్ని పూర్తి చేసి అంధ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేయాలని కోరుతూ ఎమ్మెల్యే గల్లా మాధవికి విజ్ఞప్తి చేశారు. అనంతరం దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా ఆలోచన చేయాలని కోరారు. కోడిగుడ్డు సత్రం హాస్టల్ పనులు పూర్తి చేసి గురుకుల పాఠశాలగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్. తాటికొండ నరసింహారావు. సిఖా సురేష్. పాటిబండ్ల కోటేశ్వరావు, ఈమాని చంద్రశేఖర్, సుబ్బారావు, సాదు మాల్యాద్రి, డేన్నిస్‌రాయ్, తిరువళ్ళూరు హరినాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులు నిరసన

విశాలాంధ్ర-మంగళగిరి : కలకత్తా అర్జికర్ కాలేజీలో జరిగిన దుర్ఘటనకు నిరసనగా మంగళ గిరి ఎయిమ్స్ మెడికల్ కాలేజ్ స్టూడెంట్స్ నిరసన చేపట్టారు. మెడికల్ కాలేజీ స్టూడెంట్‌పై గ్యాంగ్ రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. విధులు నిర్వహిస్తూ విశ్రాంతి కోసం వెళ్లిన జూనియర్ మెడికల్ కాలేజ్ స్టూడెంట్‌పై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డ నింధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి ఎయిమ్స్ మెడికల్ కాలేజ్ స్టూడెంట్స్ వి వాంట్ జస్టిస్ అంటూ నినాదాలతో హోరెత్తిం చారు. ఎయిమ్స్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అత్యాచారాలకు పాల్పడుతున్న నింధితులపై కఠినమైన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కలకత్తా ఆర్టికల్ కాలేజీలో జరిగిన దుర్ఘటనకు బెంగాల్ ప్రభుత్వం బాధ్యత వహిస్తూ సీబీఐకి సహకరించాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహించే డాక్టర్లకు సెంట్రల్ గవర్నమెంట్ ప్రొటెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఆపేది లేదని తెలియజేస్తూ, గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించే వరకు తమ విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ గుంటూరు జిల్లా స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది జేఎన్ఆర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఐఏఎల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.నరసింహారావు(జేఎన్ఆర్) గుంటూరు జిల్లా, సబార్డినేట్ కోర్టు బీఎస్ఎన్ఎల్ తరపు కేసులు వాదించుటకు 2024 ఏప్రిల్ 1 నుంచి ఒక సంవత్సరం పాటు లేక తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు విజయవాడ టెలికాం అసిస్టెంట్ మేనేజర్ ఉత్తర్వులు ద్వారా నియమించారు. గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఒక సంవత్సరం పాటు పానెల్‌గా నియామకాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు న్యాయవాది జేఎన్ఆర్ తెలిపారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-తెనాలి : పాఠశాలలో చదివే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని, చదువుతోపాటు క్రమశిక్షణ, సమాజసేవ తదితర విషయాలను నేర్చుకోవాలని భవిష్యత్తులో ఉత్తమ విద్యార్థులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలి హితవు పలికారు. తెనాలి, గంగానమ్మపేటలోని నారాయణ పాఠశాలలో జరిగిన కెబినెట్ ఇన్‌స్టాలేషన్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాన్ని ముందుకు నడిపించే గొప్ప నాయకు లుగా ఎదగాలని ప్రజలందరికి ఆదర్శంతు లుగా తయారుకావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్కూల్ లీడర్లుగా ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు బ్యాడ్జిలను ఇచ్చి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న డయేరియా కేసులు

విశాలాంధ్ర - కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో బుధవారం 3 కేసులు నమోదయ్యాయి. స్థానిక పిహెచ్‌సిలో వ్యాధిగ్రస్తులకు చికిత్సను అందిస్తున్నారు. గ్రామంలో వైద్యశిబిరం కొనసాగిసు_్తన్నారు. రోజురోజుకు అతిసారం కేసులు పెరుగుతున్నాయి కాని అదుపు లోకి రావడం లేదు. దీనిపై ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా ముసలివారు అతిసారం బారిన పడుతున్నారు. మెరుగైన వైద్యాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లావైద్యాధికారులను ప్రజలు కోరుతున్నారు.

నేడు శ్రీ శ్రీనివాస కన్వెన్షన్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి: నేటి డిజిటల్ యుగములో అత్యాధునిక సాంకేతిక వసతులతో ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మాణం జరుపుకున్న శ్రీ శ్రీనివాస కన్వెన్షన్ (కళ్యాణ మండపం) గురువారం ఉదయం 9 గంటలకు, శ్రీనివాస కళ్యాణంతో ప్రారంభం అవుతుందని, ఫార్చ్యూన్ గ్రూప్ అధినేతలలో ఒకరైన కొండా ప్రతాప్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు మూడు వేల మంది ఆతిథ్యం ఇచ్చే, వివిధ రకాల వేడుకలు జరుపుకునేందుకు అణువుగా ఈ కన్వెన్షన్‌ను నిర్మించినట్టు ఆయన తెలిపారు. నేడు జరిగే ప్రారంభోత్సవ కళ్యాణానికి ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

టీడీఎస్ సమస్యను పరిష్కరించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు రూరల్ మండలంలి పరిధిలో కార్పొరేషన్, ఎయిడెడ్ పరిధిలో గల ఉపాధ్యాయుల క్వార్టర్ 1, క్వార్టర్ 2 సంబంధించి టీడీఎస్ పూర్తి చేయలేదు. దాదాపు 600 మంది ఉపాధ్యాయులు ఈ ఫైలింగ్ చేయలేక పెనాల్టీ పరిధిలోకి వచ్చి ఉన్నారు. కావున ఈ విషయాన్ని తక్షణమే పరిష్కరించవలసినదిగా కోరుతూ.. లేనిచో ఐదు రోజుల తర్వాత ఎమ్ఆర్సీ ఎదుట ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టగలమని తెలియజేస్తూ గుంటూరు రూరల్ మండల విద్యాధికారికి గుటూరు నగర ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకయ్య, మహంకళరావు, లు బుధవారం మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీ.హెచ్. జోసెఫ్ సుధీర్ బాబు, జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ప్రసాదరావు, సీనియర్ నాయకులు కె విజయబాబు, కెనడి, డేవిడ్ రాజు, యు.మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు కంటే పెన్షనర్ల సమస్యలకే తొలి ప్రాధాన్యత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ శాఖ చిత్తశుద్ధితో పని చేస్తుందని కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నవారితోటలో ఉన్న జీఎస్టీ భవన్‌లో కేంద్ర జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'పెన్షన్ అదాలత్' అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ పెన్షన్ దారులందరూ తమ శాఖకు కుటుంబ సభ్యులేనని తెలిపారు. ఉద్యోగుల సమస్యల కంటే పెన్షనర్ల సమస్యలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే అదాలత్‌ల ద్వారా పెన్షన్ల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు గద్దె తిలక్, వివేకానంద మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై కమిషనర్ బాసటగా నిలవడం ప్రశంసనీయమని కొనియాడారు. తొలుత కమిషనర్ పెన్షనర్లతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ అదాలత్‌లో జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు గుమ్మడి సీతా రామయ్య చౌదరి, సీతారామరాజు, పాండు రంగారావు, సచ్చిదానంద, జవహర్‌బాబు, కల్పన, గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, పూర్ణసాయి, ప్రశాంత్, సుధీర్, సత్యనారాయణ, కోటేశ్వరరావు, సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

గురువులే విద్యార్థినీల పాలిట శాపం అయితే...: సీపీఐ

విశాలాంధ్ర-వినుకొండ : కంచె చేను మేసినట్లు విద్యాబుద్ధులు చెప్పే గురువులే విద్యార్థినిల పాలిటి శాపం అయితే ఆ బిడ్డలను ఎవరు కాపాడాలని సీపీఐ వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినీల ఆధ్వర్యంలో విద్యార్థినీలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమ ంలో పాల్గొన్న ఉలవలపూడి రాము మాట్లా డుతూ భారతదేశంలో తల్లి, తండ్రి, గురువు దైవం అని పిల్లలకి పుట్టుకతోనే నేర్పిం చటం జరుగు తుందని, దైవానికి అంటే కూడా గురువుకే మన దేశంలో ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంద న్నారు. ఇటీవల కాలంలో గురువులు విద్యార్థినీలను లైంగిక దాడులు చేయటం గురువు అనే పదానికి మచ్చ తెచ్చేలా కొందరు తులసి వనములో గంజాయి మొక్క లాంటి గురువులు ఉండటం వలన గురువు అనే పదానికి అర్థం లేకుండా పోతుందన్నారు. తల్లి దండ్రులు కూలి నాలి చేసుకుని తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానంలో చూడాలనుకుంటే ఇలాంటి గురువులు వల్ల ఆడపిల్లల్ని స్కూలుకు పంపించే పరిస్థితులు లేవని అన్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోటా విద్యార్థులపై గురువు లైంగిక దాడులు బయటకు వస్తూనే ఉన్నాయని, కారంపూడి మండలం కొదమగుండ్లలో, నిన్న నెల్లూరు రేపు ఏ ఊరు అని ఆడపిల్లల తల్లిదండ్రులు భయప డుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి గురువును బదిలీ చేయకుండా వారిని సర్వీస్ నుంచి తొలగిస్తే ఇటువంటి సంఘటన మరొకటి జరుగద న్నారు. కార్యక్రమంలో విద్యార్థినీలు వర్షిని, హసీనా, లీల, వరలక్ష్మి, నందిని, పావని, హర్షిని, కీర్తన, సిఫోర, సీపీఐ నాయకులు కొప్పరపు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు అరికట్టేందుకు చట్టాలు తేవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకొచ్చి అమలుచేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)రాష్ట్ర అధ్యక్షులు ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ అన్నారు. స్థానిక జిఎంఏ హాలులో ఐఎంఏ గుంటూరు శాఖ కలకత్తా వైద్య కళాశాలలో హత్యకు గురైన వైద్యురాలి సంతాప సభ జరిగింది. అనంతరం క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. డాక్టర్ గార్లపాటి నందకిషోర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే జూనియర్ వైద్యులు వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సమస్య తీవ్రతను కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని నందకిషోర్ విజ్ఞప్తి చేశారు. ఐఎంఏ గుంటూరుశాఖ అధ్యక్షులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు కఠినతరమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బాలినేని సాయికృష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ కె.రామ లింగేశ్వరరావు, డాక్టర్ వి.రామ తారకనాథ్, డాక్టర్ సీహెచ్. విశ్వేశ్వరరావు, డాక్టర్ బీబీ అప్పారావు, డాక్టర్ కె.రత్నబాబు, డాక్టర్ ఎస్.కిషోర్ కుమార్, డాక్టర్ టి.సేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి : ఎమ్మెల్యే జీవి

విశాలాంధ్ర-వినుకొండ : స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలు నేటితరానికి తెలియాలి : ఎమ్మెల్యే జీవి

వినుకొండలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించిన జీవీ ఆంజనేయులురాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జీవీస్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలు నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. హర్‌ఘర్ తిరంగా వంటి కార్యక్రమాల ద్వారా ఆ లక్ష్యం నెరవేరడంతో పాటు మన మువ్వెన్నెల జాతీయ పతాకం విశిష్టతను వివరించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఆగస్టు 15 భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వినుకొండలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఈ ర్యాలీని ప్రారంభించారు. జాతీయజెండా చేతబూని వందే మాత రం, భారత్ మాతాకీ జై అంటూ నినదిస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. 500 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీని ముందుండి నడిపించారు. వినుకొండ పట్టణంలోని విష్ణుకుండి నగర్ ఎన్నెస్పీ కాల్వ వద్ద నుంచి బస్టాండ్, శివయ్య స్తూపం సెంటర్ మీదుగా జాషువా కళామందిరం వరకు ర్యాలీ సాగింది. అనంతరం జాషువా కళామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించే విధంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇలాంటి ర్యాలీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇదే సందర్భంగా పేదల ఆకలి తీర్చేందుకు ఆగస్టు 15వ తేదీన సీఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారని, ఆయనకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ జీవీ ఆంజనేయులు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నియోజకవర్గం సమన్వయకర్త కొణిజెటి నాగ శ్రీను రాయల్, జిల్లా బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, అలాగే జిల్లా జనసేన నాయకులు నిస్సంకర్ శ్రీనివాసరావు, ప్రైవేట్ స్కూల్స్ డైరెక్టర్లు, టిడిపి నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, సౌదాగర్ జానీ భాష, తెలుగు విద్యార్థి నాయకులు నర్రా కిషోర్, పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్-1 (కోడ్: 05172)
2వ అంతస్తు, టిఎస్ఆర్‌టిసి కమ్యూటర్స్ ఎమినిటీ సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి,
హైదరాబాద్-500095, తెలంగాణ రాష్ట్రం, ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

డిమాండ్ నోటీసు

ఈ నోటీసు ద్వారా క్రింద తెలిపిన **రుణగ్రహీత/లు శ్రీ అవుతు వెంకట రమేష్, తండ్రి: శ్రీ అవుతు చంద్రా రెడ్డి**లకు తెలియజేయడమేమనగా బ్యాంకు నుండి పొందిన రుణసదుపాయములపై అసలు మరియు వడ్డీ చెల్లించుటలో వారు విఫలమైనందున వారి రుణఖాతాలను **నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)**గా వర్గీకరించడమైనది. కావున సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకముందు చట్టముగా పిలువబడుతుంది)లోని సెక్షన్ 13(2) క్రింద ఆఖరిగా తెలియజేసిన చిరునామాలపై వారికి నోటీసు జారీ చేసినారు. కాని అవి బట్వాడ కాకుండానే మాకు తిరిగి వచ్చినవి. కావున ఈ బహిరంగ నోటీసు రూపములో వారికి తెలియజేయడమైనది.

రుణగ్రహీత పేరు & చిరునామా	ఆస్తుల వివరాలు/చర్యలు తీసుకోనున్న సెక్యూర్డ్ ఆస్తుల చిరునామాలు	నోటీసు తేది	ఎన్‌పిఎ తేది	రావలసిన బకాయి మొత్తం (నోటీసు తేది నాటికి)
శ్రీ అవుతు వెంకట రమేష్, తండ్రి: శ్రీ అవుతు చంద్రా రెడ్డి, ఫ్లాట్ నెం. 175/సి, 2వ అంతస్తు, అడ్డగుట్ట సొసైటీ, కూకట్‌పల్లి, విజేత కాలేజి దగ్గర, హైదరాబాద్-500085 మరియు **శాశ్వత చిరునామా: శ్రీ అవుతు వెంకట రమేష్, తండ్రి: శ్రీ అవుతు చంద్రా రెడ్డి**, ఇం.నెం. 6-101, నూతక్కి, మంగళగిరి, గుంటూరు-522303 మరియు **వ్యాపార చిరునామా: శ్రీ అవుతు వెంకట రమేష్, తండ్రి: శ్రీ అవుతు చంద్రా రెడ్డి**, ఫ్లాట్ నెం. 175/సి, 2వ అంతస్తు, అడ్డగుట్ట సొసైటీ, కూకట్‌పల్లి, విజేత కాలేజి దగ్గర, హైదరాబాద్-500085 మరియు **ఆస్తి చిరునామా: శ్రీ అవుతు వెంకట రమేష్, తండ్రి: శ్రీ అవుతు చంద్రా రెడ్డి**, ఇం.నెం. 5-12-68, ఫ్లాట్ నెం. 14 నుండి 18/జె, మంగాపురం, న్యూ హౌసింగ్ కాలనీ, మీర్‌పేట్ మం॥, రంగారెడ్డి జిల్లా-500040.	**శ్రీ అవుతు వెంకట రమేష్, తండ్రి: శ్రీ అవుతు చంద్రారెడ్డి** పేరున ఉండి ఎస్ఆర్ఓ ఉప్పల్ వద్ద రిజిస్టర్డ్ చేయబడిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 85/2020, తేది: 19.12.2020 ప్రకారం తెలంగాణ రాష్ట్రం-500051, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మీర్‌పేట్, న్యూ హౌసింగ్ కాలనీ, మంగాపురం వద్ద సర్వే నెం. 31లోని 151 చ॥గ॥లు దానికి సమానమైన 126.3 చ॥మీ॥ల విస్తీర్ణము కలిగిన ఫ్లాట్ నెం. 14 నుండి 18/జెలో గ్రౌండ్ ఫ్లోర్ (1210 చ॥అ॥లు) మరియు 1వ అంతస్తు (1210 చ॥అ॥లు) మొత్తం 2420 చ॥అ॥లలో నిర్మించబడిన నివాస భవనము ఎంసిహెచ్ నెం. 5-12-68 గల యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నెం. 14 నుండి 18/ఐ, తూర్పు: రోడ్డు, దక్షిణం: ఫ్లాట్ నెం. 15 నుండి 18/కె, పడమర: ఫ్లాట్ నెం. 14 నుండి 18/సి.**	05-ఆగస్టు, 2024	13-ఫిబ్రవరి, 2023	రూ. **92,56,464.00** (రూపాయలు తొంభై రెండు లక్షల యాభై ఆరు వేల నాలుగు వందల అరవై నాలుగు మాత్రమే)

ప్రత్యామ్నాయముగా నోటీసు అందజేయుటకు చర్యలు తీసుకోబడినవి. కావున పైన తెలిపిన రుణగ్రహీత(లు)ను కోరడమేమనగా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తమును చెల్లించమని, విఫలమైనచో ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద తదుపరి చర్యలు చేపట్టబడును. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యత కొరకు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్(8)ని గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

తేది: 05.08.2024, ప్రదేశం: హైదరాబాద్, సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ఎఆర్‌బి

KALLAM TEXTILES LIMITED
CIN-L18100AP1992PLC013860
NH-5, Chowdavaram, GUNTUR - 522 019.
Ph: 0863 - 2344010, 16 Fax: 0863-2344000,
E-mail Ids : corp@kallamtextiles.in & accsp@kallamtextiles.in
GSTIN: 37AAACK9363M1ZY

EXTRACT OF UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 30th JUNE, 2024 (Rs. in Lakhs)

PARTICULARS	Quarter Ended			Year Ended
	30.06.2024 (Unaudited)	31.03.2024 (Audited)	30.06.2023 (Unaudited)	31.03.2024 (Audited)
Total income from operations (net)	5607.60	6194.17	11589.32	36738.19
Net Profit / (Loss) for the period (Before tax, exceptional and extraordinary items)	(1448.39)	(1620.40)	(1109.32)	(5611.61)
Net Profit / (Loss) for the period (Before tax and after exceptional and extraordinary items)	(1448.39)	(1620.40)	(1109.32)	(5611.61)
Net Profit / (Loss) for the period (After tax and after exceptional and extraordinary items)	(937.01)	(1097.85)	(731.15)	(3744.79)
Total Comprehensive income / (Loss) for the period (includes profit after tax and other comprehensive income net of tax)	(924.67)	(1065.43)	(718.81)	(3675.36)
Equity Share Capital	1056.21	1056.21	1056.21	1056.21
Reserves (excluding Revaluation Reserve as shown in the Balance Sheet of previous year)				3939.93
Earnings Per Share (EPS) (of 2/- each)				
a) Basic & Diluted EPS before extraordinary items	(1.77)	(2.08)	(1.38)	(7.09)
b) Basic & Diluted EPS after extraordinary items	(1.77)	(2.08)	(1.38)	(7.09)

Note: The above mentioned results are an extract of the detailed format of Unaudited Financial Results for the Quarter ended 30th June, 2024 filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of Unaudited Financial Results for Quarter ended 30th June, 2024 are available on the Stock Exchange website. **(www.bseindia.com)** and the Company's Website **(www.ksml.in)**

Place: Chowdavaram
Date : 14-08-2024

For Kallam Textiles Limited
Sd/- P. Venkateswara Reddy
(Managing Director)
DIN : 00018677

రైల్వే సదుపాయాలు పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: రైల్వే ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించాలని నరసరావు పేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. ఈ మేరకు నరసరావుపేట రైల్వే స్టేషన్లో పర్యటించారు. తాగునీరు, మరుగుదొడ్లు, రైల్వే ట్రాక్ పరిసరాలను పరిశీలించారు. ప్రయాణికులకు అందించే ఆహారంపై ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు కాస్త దృష్టి సారించాలని ఎమ్మెల్యే అరవింద బాబు కోరారు. పట్టణంలోని క్రైస్తవుల సమాధుల తోటను ఎమ్మెల్యే డా॥ చదలవాడ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, టీడీపీ నాయకులు కొట్ట కిరణ్, పెరికల రాయప్ప, క్రాంతి, బంగారం తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్ని చెరబట్టడానికి సిగ్గుపడాలి

తప్పు చేసి తప్పించుకోవాలని ప్రయత్నించడానికి మాజీ మంత్రి జోగి రమేష్ సిగ్గుపడాలని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ ఎద్దేవా చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్‌రెడ్డి, వారి ముఠా దోపిడీ ఎల్లలు దాటిపోయిందన్నారు. అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని అధికారం లోకి వచ్చిన జగన్‌రెడ్డి, వారి ముఠా అగ్రిగోల్డ్ భూముల్ని పందికొక్కుల్లా బొక్కేశారన్నారు. నరస˘రావుపేటలో కూడా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఉప్పలపాడు వద్ద గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వేసిన సాయి బాలాజీ వెంచర్లో 46 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, అందుకు తగిన ఆధారాలు అప్ప ట్లోనే జిల్లా కలెక్టర్‌కి అప్పగించామన్నారు. గత ఐదేళ్ళలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన అక్రమాలన్నీ బయటపెడతామని, రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆకాంక్షించారు.

యావత్ జాతికి గర్వకారణమైన చిహ్నం...
జాతీయ పతాకం : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: యావత్ జాతికి గర్వకారణమైన చిహ్నం మన జాతీయ పతాకం అని, ఆ మూడు రంగుల జెండాను ఇంటింటా ఎగురవేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేటలో విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. చౌత్రా సెంటర్, రిజిస్ట్రార్ కార్యాలయం, నరసరావుపేట సెంటర్ మీదుగా తిరిగి ఆర్వీఎస్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

నేడు జంతువధ నిషేధం

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్వాతం త్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న గురువారం పట్టణంలో మాంసాహారం నిషేధించడమైనది. జంతువధశాల మూసి వేయ బడును. కావున మాంసం వ్యాపారస్థులు, చికెన్ స్టాల్స్, మటన్ స్టాల్స్ వారు, చేపల వ్యాపారస్థులు తమ దుకాణాలు మూసి వేయ వలసినదిగా మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. కిచిడి హోటల్స్, రెస్టారెంట్స్ వారు కూడా మాంసాహారం విక్రయం నిలిపి వెయ్యాలని ఆమె కోరారు. ఇందుకు భిన్నంగా వ్యవహరించిన వారి పై చట్టరీత్యా తగు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వ్యాసరచన పోటీలలో విజేతలు వీరే

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక బిసి కాలనీలో గల భగత్ సింగ్ భవన్ లో స్వాతంత్ర్య దినోత్సవమును పురస్కరించుకుని ఈ నెల 13న విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతల వివరములను నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి ఎస్.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ నెల 13న విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కల్లి శ్రీ విద్య ప్రథమ బహుమతి, గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గోనుగుంట్ల రామతులసి ద్వితీయ బహుమతి, ఎన్.కృపారాణి తృతీయ బహుమతులకు ఎంపికయ్యారని అన్నారు. గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినీలు కె.ద్వారక, జె.శివనాగమణి, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినీలు ఆర్. భవ్యశ్రీ, ఎస్.కె.షిఫా, సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థినీ జి.త్రివేణి కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారన్నారు. వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు, వారికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 15న వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు వారి పాఠశాలలకు వెళ్లి బహుమతులు అందజేస్తామని అన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం మరియు దస్తావేజులు పోయినవి

పెదనందిపాడు మండలం పుసులూరు గ్రామ నివాసి **లక్కింశెట్టి పున్నయ్య తండ్రి శ్రీరాములు** కాకుమాను స్టేట్ బ్యాంక్ నందు వ్యవసాయ రుణం తీసుకునేందుకు పుసులూరు నుండి కాకుమానుకు నా కుమారుడు నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యంలో పుసులూరు గ్రామ జీరాయితీ సర్వే నెం. **362/2** లో **1.75** సెంట్ల మెట్ట భూమికి సంబంధించిన **పట్టాదారు పాసుపుస్తకం మరియు దస్తావేజులు** పోయినవి. ఎంత వెతికినా దొరకలేదు కావున దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలుపగలరు.

Ph No: 7036032769

'విజ్ఞాన్స్'తో కేంబ్రిడ్జి అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు : ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జి యూనివర్సిటీలోని ఇంగ్లీష్ అసెస్‌మెంట్ విభాగం వారు విజ్ఞాన్స్ యూనివర్సిటీతో లింగ్వా స్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) చేసుకు న్నారని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగ భూషణ్ బుధవారం తెలిపారు. ఎంఓయూకు సంబంధిన అవగాహన పత్రా లను కేంబ్రిడ్జి యూనివర్సిటీ సౌత్ ఏసియా రీజనల్ డైరక్టర్ అరుణాచలం, సౌత్ ఇండియా డీజీఎం కార్తి సుబ్రమణియన్‌కు విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అందించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ కేంబ్రిడ్జి యూనివర్సిటీ వారు లింగ్వాస్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌ను ప్రపంచ వ్యాప్తంగా మొట్టమొదటగా తమ యూనివర్సిటీలోనే ప్రయోగాత్మకంగా ప్రవేశపెడుతున్నారని తెలియజేసారు. కార్యక్రమంలో కేంబ్రిడ్జ్ కార్పొరేట్ రిలేషన్స్ రీజనల్ మేనేజర్ పద్మజ శివకుమార్, ఈఎల్‌టీ మేనేజర్ మలికార్జున నాయుడు పచిపాల, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కేఎల్‌పీలో రోబోటిక్ సైన్స్ ఎక్స్‌పో

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టరు కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 15, 16 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డు హెచ్‌వోడీ తుమ్మల శ్రీనివాసరావు పర్య వేక్షణలో రోబోటిక్స్ సైన్స్ ఎక్స్‌పో జరుగుతుందని పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాలలోని సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టరు రాయపాటి శ్రీనివాసరావు, శ్రేష్ట హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. గొట్టిపాటి నాగార్జున విచ్చేయుచున్నారని తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపల్ జి.రత్తయ్య మాట్లాడుతూ నగరంలోని అన్ని పాఠశాలలను ఆహ్వానించడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర-ఈపూరు: పోటీతత్వం ఉన్నప్పుడే నేర్చుకోవాలన్న జిజ్ఞాస విద్యార్థుల్లో పెరుగుతుందని ఈపూరు గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మండల కేంద్రమైన ఈపూరు నందు ఉన్న గ్రంథాలయంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చైర్స్, రన్నింగ్ పోటీలను బుధవారం నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోల ఏర్పాటు

విశాలాంధ్ర-వినుకొండ :వినుకొండ నియోజకవర్గం ఎమ్మార్వో ఆఫీస్ నందు డిప్యూటీ కలెక్టర్ ఐదు మండలాల ఎమ్మా ర్వోలు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. వినుకొండ నియోజక వర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ కొంజేటి నాగశ్రీ రాయల్ పాల్గొన్నారు. ఐదు మండలాల ఎమ్మార్వో ఆఫీస్ లో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు ఫోటోతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మార్వోలు తప్పకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సీఐగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-గురజాల: రెవెన్యూ డివిజనల్ కేంద్రం గురజాల సీఐగా దాసరి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో పనిచేసిన ఆయన సాధారణ బదిలీలలో భాగంగా గురజాల సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాలలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన సీఐను పలువురు పట్టణ ప్రముఖులు కలసి అభినందనలు తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలి

విశాలాంధ్ర-ఈపూరు: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని సీపీఐ మండల నాయకులు ఊట్ల రామా రావు, సూరే అప్పారావులు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో బుధవారం సీపీఐ నాయకులు మాట్లాడుతూ మన జాతీయ జెండా త్రివర్ణ పతాకం త్యాగం, విధేయత, శాంతికి చిహ్నమని, స్వాతంత్ర్య వీరులను స్మరించుకోవడమని, జాతీయ ఐక్యతను పెంపొం దించడానికి ఒక మాధ్యమన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు వందన సమర్పణ

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి, జెయంజె కళాశాల ఎన్‌సిసి విభాగం వారు కళాశాల నుండి పెద్ద ర్యాలీగా రణరంగచౌక్ వద్దకు చేరుకున్నారు. మార్చ్ పాస్ట్ చేస్తూ స్వాతంత్ర్య సమరయోధులకు పూల మాలలు సమర్పించి వందన సమర్పణ చేశారు. ఎన్‌సిసి కాడెట్స్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షైనీ, డా.అరుణ సుజాత పాల్గొన్నారు.

రాజేష్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర-మాచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న తెలుగు దేశం పార్టీ కార్యకర్త చక్క రాజేష్ మృతదేహాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. సందర్భంగా ఎమ్మెల్యే జేబీఆర్ మాట్లాడుతూ రాజేష్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ క్రియాశీలక కార్యకర్త సోషల్ మీడియాలో క్రియాశీలకంగా పనిచేస్తున్న రాజేష్ మరణం వార్త తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అన్నారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, ఆ పార్టీ సీనియర్ నాయకులు యనమల కేశవరెడ్డి, టౌన్ అధ్యక్షులు కొమెరా దుర్గారావు, యువ నాయకులు కంభంపాటి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇన్‌ఛార్జ్ యార్లగడ్డ లెనిన్ భార్య మృతి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నియోజకవర్గం బీజేపీ ఇన్‌ఛార్జ్ యార్లగడ్డ లెనిన్ కుమార్ భార్య శ్రీలక్ష్మి (45) బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. గత వారం రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. స్థానిక జయకృష్ణ టవర్స్‌లో ఉంచిన శ్రీ లక్ష్మీ మృతదేహాన్ని పలువురు వ్యాపారవర్గాలు, వివిధ పార్టీల రాజకీయ నేతలు, ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, బంధుమిత్రులు, సన్నిహితులు లక్ష్మీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. లెనిన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు మక్కెన మల్లికార్జునరావు, పీవీ సురేష్ బాబు, జి. విశ్వనాధం, ఖాసీం, జీవి రమణారావు, బీజేపీ జిల్లా నేతలు మరియు స్థానిక నేతలు మేడం రమేష్, రాఘవ, మస్తాన్‌రావు, జనసేన నేతలు శ్రీనివాసులు, కె. నాగశ్రీను, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌నేతలు సుబ్బారావు, బ్రహ్మం శ్రీకాంత్, కంచర్ల సుబ్బారావు, మీడియా ప్రతినిధులు ఆర్ ప్రకాష్, టి. శ్రీనివాసరావు, లగడపాటి వెంకటరావు, ఫిరోజ్, యూసఫ్, జిల్లా మీడియా ప్రతినిధులు వాసిరెడ్డి రవిచంద్ర, కటకం శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఉన్నారు.

CHANGE OF NAME

I, **MOVVA ROHINI KRISHNA** (Old Name), D/o. **MOVVA KRISHNA RAO**, Resident of Flat No.204, Ramesh Grand Apartments, 2nd Line, Rajendra Nagar, Guntur - 522006, Andhra Pradesh. I have changed my name from **MOVVA ROHINI KRISHNA** to **MOVVA RAMYA**. Hereafter my name is known as **MOVVA RAMYA.**

మంత్రిని కలిసిన కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న పులి శ్రీనివాసులు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, పురపాలక స్పెషల్ చీఫ్ సెక్రెటరి అనిల్ కుమార్ సింఘాల్, గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీలను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

జీఎంసీ కమిషనర్‌గా శ్రీనివాసులు బాధ్యతలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా పులి శ్రీనివాసులు బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ నగర మేయర్, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ గుంటూరు నగరాన్ని అన్ని అంశాల్లో మెరుగ్గా నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్ శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, డి.వెంకట లక్ష్మీ, ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-తాడేపల్లి : పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు అని గుంటూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ అన్నారు. బుధవారం తాడేపల్లి ప్రాతూరులోని వారి కార్యాలయంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేస్తే మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉండి కూడా గత రెండు సంవత్సరాలకు పైగా నియోజకవర్గంలో మూడు అన్న క్యాంటీన్లను నిర్వహించారని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగానే అన్నా క్యాంటీన్లను రెండు నెలల్లోనే కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తుందన్నారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించనుందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడివాడలో గురువారం అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారని తెలిపారు.

విద్యుత్ అపరాధ రుసుం రూ.5.94 లక్షలు

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని ఏడు గ్రామాలలో బుధవారం విద్యుత్తు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. 51 బృందాలుగా ఏర్పడ్డ అధికారులు, 185 మంది సిబ్బంది 4956 సర్వీసులను పరిశీలించారు. మీటరు లేకుండా చౌర్యం, మీటరున్నా చౌర్యం, అనుమతి లేని కేటగిరీలో విద్యుత్తు వాడకం లోడు కంటే అదనంగా వినియోగం, తక్కువ బిల్లుల నమోదు చేసిన వినియోగదారుల నుండి రూ. 5.94 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఈఈలు, డీఈఈలు ఎం.రవి కుమార్, రవి కుమార్, వీరేశ్వరరావు, ఏఈలు, చంద్రశేఖర్ తెలిపారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు పెదకూరపాడులో హాల్ట్ ఇవ్వాలని పెదకూరపాడు, అమరావతి మండలాల్లోని ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుందని అభ్యుదయ రచయితల సంఘం (అరసం)రాష్ట్ర కార్యదర్శి కె.శరత్ చంద్ర జ్యోతి శ్రీ, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు తెలిపారు. వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ జరుగుతుంది. బుధవారం మండల పరిధిలోని బలుసుపాడు, కాశిపాడు, పాటిబండ్ల గ్రామాలలో సంతకాల సేకరణ జరిగింది. రేపల్లె-సికింద్రాబాద్ ప్యాసింజర్‌కు హాల్ట్ కల్పించాలని గ్రామీణ ప్రాంత ప్రజల నుండి కూడా పెద్ద ఎత్తున కోరుచున్నారన్నారు. పాలకులు, అధికారులు స్పందించాలన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆర్.ఉమా మహేశ్వరరావు, ఎం.రాంబాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి : జంగాల

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: సీపీఐ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ కోరారు. సీపీఐ తాడికొండ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకర రావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 26న సీపీఐ శతదినోత్సవ వేడుకలను జరుపుకుంటున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల సమావేశాలను పూర్తి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల శివాజీ, కాబోతు ఈశ్వర రావు, సీపీఐ నాయకులు రామినేని రామారావు, కంబంపాడు దేవుని దయ, బండి సాంబయ్య, రేపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మాచర్ల: వడ్డెర్ల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని రైల్వే రోడ్డు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కళ్యాణ మండపం నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెబీఆర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వడ్డెర్లకు అండగా ఉంటుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి మాచర్లలో వడ్డెర్లు పార్టీకి అండగా వున్నారని, వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ కమిటి సభ్యులు వేముల నాగయ్య, గుంతల రామారావు, ఆదినారాయణ, సైదయ్య పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శోభారాణి

విశాలాంధ్ర-దాచేపల్లి: ఎంపీడీవోగా శోభారాణి బుధవారం ఉద్యోగ బాధ్యతలు అందుకున్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. దాంతో ఎంపీపీ కందుల జాను, ఈవోపీఆర్డీ నాగేంద్ర రత్నం తదితరులు ఆమెను అభినందించారు. అనంతరం ఇక్కడ మూడు రోజులుగా జరుగుతున్న సర్పం చులు, కార్యదర్శుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.

నేడు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- హాజరుకానున్న మంత్రి నారా లోకేష్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు బుధవారం జరగనున్నాయి. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ లతో కలసి పరిశీలించారు. పెరేడ్ గ్రౌండ్ లో డయాస్, వివిధ శాఖలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, వీఐపీ గ్యాలరీ, స్టూడెంట్స్ గ్యాలరీ, పబ్లిక్ గ్యాలరీ, మీడియా గ్యాలరీ లను పరిశీలించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెచ్ఆర్డీ, ఐటి ఎలక్ట్రానిక్స్ , కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని జాతీయ పతాక ఆవిష్కరణ చేపట్టనున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, పీడీ డీఆర్డీఏ హరిహర నాథ్, జెడ్పి డిప్యూటీ సిఈఓ మోహన్ రావు, డిటి డబ్ల్యూఓ శిరీష , జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్స్‌లో స్వాతంత్ర్య వేడుకలు

విశాలాంధ్ర- వినుకొండ : స్థానిక గీతాంజలి స్కూల్స్ నందు 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గీతాంజలి స్కూల్స్ ప్రిన్సిపల్ శ్రీమతి తేళ్ళ కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నా రులకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు అందించారు. భారతదేశం ఆంగ్లేయుల దాస్య శృంకలాల నుండి విముక్తిని పొంది 77 వసంతాలు పూర్తి చేసుకుని 78వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఎందరో త్యాగధనుల త్యాగాలను స్మరించుకుంటూ భావి భారత పౌరులుగా ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముం దుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా చిన్నా రులు దేశ నాయకుల వేష ధారణలతో చేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. గీతాంజలి విద్యాసంస్థల కరెస్పాండెంట్ కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి, షరాఫ్ బజారులోని శ్రీ కామాక్షి స్వర్ణకారుల సంఘం తెనాలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రెసిడెంట్ గొళ్ళపల్లి శ్రీనివాసరావు, సెక్రెటరి షేక్ నసర్ అహ్మద్, ట్రెజరర్ కనగాల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు కొమ్మూరి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్, వీరమల్లు బాలజీల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వారిని రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ ఘనంగా సత్కరించారు. స్వర్ణకార సంఘ సభ్యులు, అభిమానులు, స్వర్ణకారులు విశేషంగా పాల్గొన్నారు.

ఒప్పిచర్ల సర్పంచ్‌గా పుష్పలత , వెంకట శివరావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-కారంపూడి : మండలంలోని ఒప్పిచర్ల గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ గా గంగసపల్లి పుష్పలత వెంకట శివరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ రామదేవి లక్ష్మీ, అంజయ్య అనివార్య కారణాలవల్ల సెలవు పెట్టడంతో ఇంచార్జ్ సర్పంచ్‌గా గంగన పల్లి పుష్పలత వెంకట శివరావు బాధ్యతలు స్వీకరించారు. పంగులూరి పుల్లయ్య, పంగులూరి అంజయ్య, వున్నం లక్ష్మీనారాయణ, మాదల సత్యనారాయణ, కొండపల్లి పెద్ద అప్పారావు, చప్పిడి రాము, గోళ్ళ సురేష్ యాదవ్, బొల్లినేని శీను, ఇరుకులపాటి శ్రీను, పిన్నెల్లి అనంత రామయ్య, కేసనపల్లి కృష్ణబాబు, పంచాయతీ కార్యదర్శి భూతేశ్వర్ రెడ్డి, విఆర్ఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రథ సారథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర ఆదేశాల మేరకు స్థానిక కొత్తపేట 6వ మండలంలో ఆ మండల అధ్యక్షుడు సురేష్ కుమార్ జైన్ ఆధ్వర్యంలో విజడమ్ స్కూలు విద్యార్థులతో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి ముఖ్య అతిథులుగా వనమా నరేంద్ర, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్, ప్రిన్సిపల్ రవి పాల్గొని ర్యాలీని ప్రారంభించి వీధి వీధిన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి కో-కన్వీనర్ షేక్ రఫీ, షేక్ ఖుదుస్, షేక్ రవూఫ్, పోతురాజు వెంకట్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రపరచిన డాక్టర్ ఉమా శంకర్ : 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఉన్న స్వాతంత్ర్య సరమయోధుల విగ్రహాలను ఆ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, నియోకవర్గ సమన్వయకర్త, అహల్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమా శంకర్, ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజకుమారి శుభ్రపరిచారు.

శిక్షణా తరగతులకు హాజరైన బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మండల పరిషత్ కార్యాలయంలో చివరి రోజు నిర్వహించిన పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా తరగతులకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల ఈటీసీ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి హాజరైయ్యారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25 పరిశీలన, ఉత్తమ జీపీడీపీ పంచాయతీ, తక్కువ ప్రోగ్రెస్ జీపీడీపీ పంచాయతీలలో గుర్తించిన అంశాలు, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, సీసీ చార్జీల చెల్లింపులు, పారిశుధ్యం తదితర అంశాల గురించి వివరించారు. ముగింపు శిక్షణా తరగతులలో భాగంగా గ్రూప్ డిస్కషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు డి.అన్నమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డి.రామ కోటయ్య, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.